క్లుప్తంగా

108 వాహనంలో మహిళ ప్రసవం



బెల్లంకొండ: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 వాహనంలో వైద్యశాలకు తరలించే క్రమంలో 108 వాహనంలోనే గురువారం రాత్రి ప్రసవించింది. మండలంలోని మాచయపాలెం గ్రామానికి చెందిన ఆరుమల్ల ప్రసన్నకుమారి నిండు గర్భిణి. గురువారం రాత్రి 8 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. కాగా అంబులెన్స్ సిబ్బంది వెంటనే ప్రసన్నకుమారిని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. పీహెచ్‌సీ సిబ్బంది ప్రసన్నకుమారికి పరీక్షలు నిర్వహించి, హై రిస్క్ డెలివరీ అంటూ వైద్యుల సూచన మేరకు నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. వెంటనే కుటుంబ సభ్యులు అదే 108 వాహనంలో నరసరావుపేటకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ప్రసన్నకుమారి ఆడబిడ్డను ప్రసవించింది. ఈఎంటీ గోపి, పైలెట్ నాగరాజు, ఆశా కార్యకర్త ప్రసవం చేశారు. పీహెచ్‌సీలో హైరిస్క్ డెలివరీ అని చెప్పారని, 108 సిబ్బంది సులభంగా డెలివరీ చేసారని మహిళ కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా బుధవారమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి, వైద్యశాలలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించినప్పటికీ పీహెచ్‌సీ సిబ్బంది ఆ మాటలను పెడచెవిన పెడుతున్నారు.


బలిజేపల్లిలో గ్రామ సచివాలయం ప్రారంభం



రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయంను రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణలు శుక్రవారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ పల్లపాటి పెద్దిరాజు ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రం అప్పులలో ఉందని అయినా కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందని తెలిపారు. ముందుగా గ్రామం మధ్యలో ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు, కోడెల శివప్రసాద్‌రావు విగ్రహాలను ఆవిష్కరించారు. లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరాం, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, లాయరు పూజల కోటయ్య, అంచుల నరసింహారావు, లంకా వీరయ్య, అంకాళ్ల ప్రభుదాసు, పగడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

ఎంఈవో–2 బాలసుందరరావు



బెల్లంకొండ: తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి–2 బాలసుందరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కందిపాడు గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి 'ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని తెలిపారు. ఉచిత పుస్తకాల పంపిణీ, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అన్ని వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని తల్లిదండ్రులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఐదేళ్లు నిండిన పిల్లల వివరాలు సేకరించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ

పిడుగురాళ్ల: మిరపకాయలు కోసేందుకు కూలీలు వెళ్తున్న ఆటోను వెనుక వైపు నుంచి లారీ ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. తుమ్మలచెరువు గ్రామానికి చెందిన కొంత మంది కూలీలు పొలాలకు మిరప కాయలు కోసేందుకు ఆటోలో వెళ్తున్నారు. తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద లారీ ఢీకొనటంతో ఆటోలో ప్రయాణిస్తున్న అంజలి, శివమ్మ, జగన్‌కుమారిలకు గాయాలు అయ్యాయి. టోల్‌ప్లాజా అంబులెన్స్ సహాయంతో క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ మలుపులు.. మృత్యుకుహరాలు

- ప్రధాన రహదారులలో తరచూ ప్రమాదాలు
- మలుపులోని పాఠశాలల వద్ద స్పీడు బ్రేకర్స్ నిర్మించాలంటున్న ఉపాధ్యాయులు
- దగ్గరకు వచ్చే వరకు కనపడని ఎదురుగా వచ్చే వాహనాలు
- కొరవడిన హెచ్చరిక బోర్డులు



గురుకుల పాఠశాల, కస్తూరిబా పాఠశాల వద్ద మలుపు



వేల్పూరు జెడ్పీ హైస్కూలు వద్ద మలుపు

అచ్చంపేట: ఆర్ అండ్ బీ (రోడ్లు భవనాల శాఖ) పరిధిలోని ప్రధాన రహదారులలో మలుపులు మృత్యు కుహరాలుగా మారాయి. మండల కేంద్రమైన అచ్చంపేటకు మూడు వైపుల ఆర్ అండ్ బీ రోడ్లు ఉన్నాయి. ఒకవైపు సత్తెనపల్లి, మరో వైపు మాదిపాడు, ఇంకోవైపు అమరావతి వైపు రోడ్లు ఉన్నాయి. మూడు రోడ్లు ప్రధానమైనవే.. ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనాలు వెళుతూ ఉంటాయి. మూడు రోడ్లలో మలుపులు చాలా ఉన్నాయి. కొన్ని చోట్ల కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా లేవు. దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వస్తున్న వాహనం కనిపించదు. దీనివల్ల నెలలో కనీసం మూడు నాలుగు ప్రాంతాలలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొంత మంది కాళ్లు చేతులు పోగొట్టుకుంటున్నారు. కొందరు ఆస్పత్రి పాలవుతూ నెలల తరబడి కోమాలో ఉండి మృత్యు ఒడిలోకి జారుకుంటున్నారు. కొంత మంది అక్కడికక్కడే మృతి చెందుతుండగా, మరి కొందరు ప్రమాదానికి గురై వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందుతున్నారు.

ముఖ్యమైన ప్రమాదాల మలుపులు

- స్థానిక ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల వద్ద మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పాఠశాల ఎదురుగానే కస్తూరిబా బాలికల పాఠశాల కూడా ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలు చూసేందుకు వచ్చి రోడ్డు పక్కనే కూర్చుంటారు. వచ్చిపోయే వాహనాలతో వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్ వేయాలని ఉపాధ్యాయులు అనేక సార్లు ఆర్ అండ్ బీ అధికారులకు విన్నవించామని చెబుతున్నారు.
- మాదిపాడు రోడ్డులోని దోసపాటి చెరువుకు సమీపంలోని మలుపులో చాలా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ఇక్కడ స్పీడ్ బ్రేకర్స్ (వేగ నియంత్రికలు) లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదానికి గురవుతున్నాయి.
- తాడువాయి వద్ద బొగ్గవాగు మలుపులో రోడ్డు పక్కనే చెట్లు పెరిగి ఉండటం, వాగు చప్టా మలుపుని ఆనుకొని ఉండటంతో ప్రమాదంగా మారింది. ఇక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డు ఉంచవలసి ఉంది.
- వేల్పూరులోని జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద మలుపులో చాలా ప్రమాదాలు జరిగాయి. ముఖ్యంగా టూ వీలర్స్, హెవీలోడ్‌తో వెళ్లే ఆటోలు, కూలీలతో వెళ్లే ట్రాక్టర్లు ప్రమదాలకు గురవుతున్నాయి. స్కూలుకు వచ్చిపోయేటప్పుడు విద్యార్థులు భయం భయంగా ఉండాల్సిన పరిస్థితి.
- అమరావతి రోడ్డులోని కోగంటివారిపాలెం దాటిన తరువాత మలుపులో రాత్రి సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కందకంలో పడిపోతున్నారు.

మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఉంచడం, పాఠశాలల వద్ద ఉన్న మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్స్ నిర్మించి ప్రమాదాలను నివారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో, ట్రాక్టరు యజమానులు కోరుతున్నారు.

మలుపులలో జరిగిన ప్రమాదాలు

- గత మే 22న కోనూరు నుంచి దైవదర్శానాకి 12 మందితో వెళుతున్న ఆటో తాడువాయి బుగ్గవాగు మలుపులో అదుపు తప్పడంతో అందులో ప్రయాణిస్తున్న నడికుదురు చిన్న వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి.
- గత ఏడాది ఆగస్టులో తాళ్లచెరువుకు చెందిన జార్జిరెడ్డి టూ వీలర్‌పై వెళుతూ, వేల్పూరు–క్రోసూరు రోడ్డులోని మలుపులో ఎదురుగా వచ్చే ట్రాక్టరును ఢీకొట్టి మృతి చెందాడు.
- గత డిసెంబర్ 4న బైకుపై వెళుతున్న ముగ్గురు విద్యార్థులు ఎదురుగా వచ్చే ట్రాక్టరును ఢీకొట్టి ఆసుపత్రి పాలయ్యారు.
- అదే నెల 15న వేల్పూరు దాటిన తరువాత వచ్చే బొగ్గవరపు గురవయ్య కాలేజీ వద్ద మలుపులో పెదపాలెంకు చెందిన కె.వెంకటేష్ ద్విచక్ర వాహనంపై వెళుతూ ట్రాక్టరు ఢీకొట్టడంతో మృతి చెందాడు.



తాడువాయి వద్ద జరిగిన ప్రమాదంలో ట్రాక్టరు కిందకు దూసుకుపోయిన బైకు

- అలాగే డిసెంబర్ 26న 30 మంది కూలీలతో వెళుతున్న ట్రాక్టరు తాడువాయి మలుపులో అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
- ఇలా చెప్పుకుంటూ పోతే ప్రమాదాలు చాలానే జరుగుతున్నాయి. కొంత మంది చిన్న చిన్న గాయాలతో బయటపడుతున్నారు. మరికొందరు అవయవాలను కోల్పోతుండగా, ఇంకొంత మంది మృత్యువాత పడుతున్నారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్ కృష్ణవేణి అరెస్ట్ విచారకరం

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిట్టా విజయ భాస్కర్ రెడ్డి

సత్తెనపల్లి: సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటి కృష్ణవేణి అరెస్ట్ అత్యంత విచారకరమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలేటి కృష్ణవేణి అనే మహిళను కస్టడీలోకి తీసుకొని గురజాల నియోజకవర్గం దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడమే కాకుండా ఎవరిని ప్రవేశించకుండా ఏకంగా పోలీస్‌స్టేషన్‌కి తాళాలు వేయడం చూస్తుంటే అది పోలీస్ స్టేషనా? లేదా తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వారి గృహమా అని ప్రశ్నించారు. కేవలం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ అని హైదరాబాదులో ఉన్న కృష్ణవేణిని అరెస్టు చేయడం, చూడడానికి బంధువులను గానీ, పార్టీ నాయకులు, కార్యకర్తలను గానీ వెళ్లనీయకుండా ప్రభుత్వ లా అండ్ ఆర్డర్ ఆఫీస్ అయిన స్టేషన్‌కు తాళాలు వేయడం ఏమిటన్నారు. ఇటీవల మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు ముసుగు వేయలేదని 11 మంది పోలీసులపై చర్య తీసుకున్న పోలీసు అధికార యంత్రాంగం ఇప్పుడు ఎందుకు నోరు మెదపరు అని ప్రశ్నించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగాలు

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, టాలీ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ శుక్రవారం తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లమా, డిగ్రీ పాస్/ఫెయిల్, 18 నుంచి 28 సంవత్సరాల యువతకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం కల్పించబడతాయన్నారు. మరిన్ని వివరాలకు హరిప్రసాద్ 9000487423 నంబర్‌లో సంప్రదించాలన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

భూమిపై అవతరించిన దయామయుడు క్రీస్తు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పలు చోట్ల ఏసు సిలువ ఘట్టం ప్రదర్శన

సత్తెనపల్లి: సమాధి నుంచి సజీవంగా పునరుత్థానుడైన ఏకైక వ్యక్తి దైవ కుమారుడు ఏసు క్రీస్తు అని పలువురు పాస్టర్లు అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పట్టణం, మండలంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు దైవ సందేశం అందించారు. ప్రేమే మార్గంగా .. త్యాగమే ఆయుధంగా ప్రేమతో మానవాళి పాపాలను కడిగి వేయడానికి పాపుల కన్నీళ్లు తుడవడానికి భూమిపై అవతరించిన దయామయుడు సిలువపై రక్తం చిందించిన రోజును 'గుడ్ ఫ్రైడే'గా జరుపుకుంటామన్నారు. లోకంలోని సమస్త పాపాలు కడిగి వేయబడి అందరినీ తన రక్తంతో.. త్యాగంతో పరిశుద్ధాత్మలుగా మార్చిన రోజు కాబట్టి శుభ శుక్రవారం అంటున్నామని తెలిపారు. గుడ్ ఫ్రై డే అంటే హంగులు, ఆర్భాటాలు కాదని.. భగవంతుడికి మన హృదయాన్ని సమర్పించు కోవడమేనని బైబిల్ ప్రవచిస్తోందన్నారు. ఏసు సిలువపై చిత్రహింసలు అనుభవించి మరణించిన మూడోరోజు పునరుత్థానుడై లోకానికి శుభ సందేశ మందించాడన్నారు. పాపులను పరిశుద్ధాత్మలుగా మార్చడానికి క్రీస్తు చూపిన త్యాగ నిరతిని, కరుణామయుడి ఆదర్శ జీవితాన్ని అవగాహన చేసుకుంటే జీవితంలో ఏమి చేయాలో తెలుస్తుందని, మన హృదయాన్ని దైవ కుమారుడికి సమర్పించుకోవడమే వేడుకగా భావించాలన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో నాటి రోమన్ ప్రభుత్వం ఏసుక్రీస్తును సిలువ వేయడాన్ని ఘట్టాల రూపంలో వివరించేలా ప్రత్యక్షంగా చూపారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం క్రైస్తవ భక్తులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలలో పాల్గొన్నారు. పవిత్ర శుక్రవారంను పురస్కరించుకుని మండలంలోని పాపాయపాలెం, నందిరాజుపాలెం, బెల్లంకొండ, మన్నెసుల్తాన్‌పాలెం, చంద్రాజుపాలెం, వెంకటాయపాలెం గ్రామాలలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. సర్వజనుల శ్రేయస్సు కోసం కష్టాలను స్వీకరించిన ప్రభువు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాలలో క్రైస్తవ మాలలను స్వీకరించిన భక్తులు చర్చిలలో ప్రభువు సన్నిధిలో ఉన్నారు. ప్రాణాలను అర్పించిన ప్రభువు మానవాళి కోసం మూడవ రోజు పునరుత్థానుడై వచ్చినట్లు పలువురు క్రీస్తు బోధకులు వివరించారు.

నకరికల్లులో...

నకరికల్లు: దేవుని కుమారుడు ఏసు చూపిన మార్గం ఆచరణీయమని పలువురు పాస్టర్‌లు బోధించారు. మండలంలోని పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలను క్రైస్తవులు శుక్రవారం జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని చర్చిలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు మాట్లాడుతూ ప్రజలను పీడిస్తున్న ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి క్రీస్తు స్వస్థత కల్పించారని అన్నారు. ఏసు క్రీస్తు చూపిన మార్గంలో నడిచి మోక్షం పొందాలని బోధించారు. కార్యక్రమంలో చర్చిల పాస్టర్‌లు, క్రైస్తవ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే ప్రార్థనలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తును కొరడాలతో కొట్టి, ముళ్ల కిరీటం పెట్టి, సిలువ వేసిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రై డేగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా చర్చిలలో సామూహిక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. సిలువపై క్రీస్తు పలికిన ఏడు మాటలను ఆయా చర్చిలలో సంఘ కాపరులు వివరించారు. చర్చి ఆవరణలో బెల్లంతో కలిపిన పానకాన్ని తాగి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు శిరోధార్యం

పెదకూరపాడు: మండల పరిధిలోని వివిధ గ్రామాల చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక లూథరన్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ నరేష్‌కుమార్ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి శిరోధార్యమన్నారు. అనంతరం క్రీస్తు ఆరాధికులకు గుడిపూడి కాంతారావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆర్‌సీఎం చర్చిలో సిలువను ఉంచి ప్రత్యేక ప్రార్థనల అనంతరం సిలువధ్యానం నిర్వహించారు. అలాగే తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ ప్రతినిధి జవ్వాజిసనతీష్ ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని చర్చిలలో బ్రెడ్, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అన్ని గ్రామాల చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్రోసూరులో...

క్రోసూరు: గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల ప్రార్థనా మందిరాల్లో, చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు, ఫాదర్లు గుడ్ ఫ్రైడే, ఏసు క్రీస్తు సిలువ వృత్తాంతం తెలియజేసారు. ఏసుప్రభు భుజాలపై సిలువను పెట్టి ప్రభువులు అమలు చేసిన కఠిన శిక్షను వీధుల్లో ప్రదర్శించారు. మండల కేంద్రమైన క్రోసురు లూథరన్ చర్చిలో పాస్టర్ డాక్టర్.రెవ.ఎం.సుందరరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువలో మరణించిన రోజును గుడ్ ఫ్రైడేగా తెలిపారు. ఏసు సిలువపై పలికిన ఏడు మాటల గురించి బోధించారు. ప్రార్థనల అనంతరం ద్రాక్ష రసం, పానకం విశ్వాసులకు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీలు, విశ్వాసులు వందలాది మంది పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: మండలంలోని అన్ని చర్చిలలో గుడ్ ఫ్రై డే ప్రార్థనలు ఘనంగా జరిగాయి. తాడువాయి ఆర్సీఎం చర్చిలో క్రైస్తవులు భారీగా పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. చర్చి వద్ద నుంచి క్రైస్తవులు క్రీస్తు సిలువను గ్రామ వీధులలో మోసుకుంటూ కొండ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విచారణ గురువులు రెవ.ఫాదర్ పుట్టి అంతోనిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజులుగా క్రైస్తవులు చేపట్టిన ఉపవాస దీక్షలను విరమించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చెరుకుంపాలెం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు ఏసు వేషధారణలో సిలువను మోసుకుంటూ గ్రామంలో ప్రదర్శన చేశారు. క్రైస్తువులు తరలివచ్చి ప్రదర్శనను తిలకించారు. చర్చి ఫాదర్స్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైబిల్ పఠన చేసి గుడ్ ఫ్రైడే ప్రాధాన్యతను వివరించారు. తాళ్లచెరువులోని బాల యేసు మందిరంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. భక్తి గీతాలను ఆలపించారు. ఏసుక్రీస్తు జీవిత చరిత్రను ప్రదర్శించారు. సిలువను గ్రామ వీధులలో ఊరేగించారు.



సత్తెనపల్లి ఆర్‌సీఎం చర్చి వద్ద ఏసుక్రీస్తు సిలువ వేసే ఘట్టం ప్రదర్శన



ఏసుక్రీస్తు సిలువ ఘట్టాలను వీక్షిస్తున్న జనం



నకరికల్లులోని ఎస్సీ కాలనీ చర్చిలో ప్రార్థనలు



పెదకూరపాడు లూథరన్ చర్చిలో ప్రార్థనలు



క్రోసూరు లూథరన్ చర్చిలో గుడ్ ఫ్రై డే ప్రార్థనలు



తాడువాయిలో సిలువ ఊరేగింపులో క్రైస్తవులు

క్రీస్తు మార్గం ఆచరణీయం

అమరావతి: లోకంలో పాపకర్మలను శిక్షించకుండా వారు చేసిన పాపాన్ని పరిహరించటానికి ఏసుక్రీస్తు సిలువపై శిక్షింపబడ్డాడని ఫాదర్ గంగోలు భాస్కర్ అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రై డే సందర్భంగా స్థానిక పల్లోటి చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో క్రీస్తు బోధనలను వివరించారు. క్రీస్తు బోధనలలోని కరుణ, సాత్వికత, ప్రేమ, క్షమాపణ వంటి విలువలను అందరూ కలిగి ఉండాలన్నారు. క్రీస్తు మానవుని పాపాలను హరించి సన్మార్గంలో జీవించేటట్లు చేయటానికి సిలువపై పడిన బాధలను వివరించారు. ఉపవాస దీక్షలు ఆచరించినవారు దీక్ష విరమణ అనంతరం కూడా సన్మార్గంలో జీవించాలన్నారు. భక్తులతో సిలువ మార్గం కార్యక్రమం పల్లోటి చర్చి నుంచి ప్రారంభమై బస్టాండ్ సెంటర్, మద్దూరురోడ్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, క్రోసూరు రోడ్డు మీదుగా తిరిగి చర్చి వద్దకు చేరింది. ఈ మార్గమధ్యంలో 14 స్థానాలలో దేవుని వాక్యాన్ని చదివి భక్తులకు వినిపించారు. ఈ సందర్భంగా భక్తులు సిలువను మోయటానికి పోటీ పడ్డారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల చర్చిలలో గుడ్ ఫ్రై డే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సువార్త నామాన్ని జపిస్తూ భక్తులు, విశ్వాసులు, ఏసు దీక్షాపరులు సిలువ మార్గాన్ని నిర్వహించారు.



సిలువ మార్గంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఆరాధికులు

గుడ్ ఫ్రై డే సందర్భంగా ఆర్‌సీఎం చర్చిలో రక్తదానం

సత్తెనపల్లి: గుడ్ ఫ్రై డే సందర్భంగా పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మార్గదర్శకత్వంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ రెవరెండ్ ఎస్.రాజేష్ మాట్లాడుతూ పవిత్ర శుక్రవారం యేసు రక్తాన్ని చిందించి సిలువ వేసిన రోజును స్మరించుకుంటూ తాము కూడా రక్తదానం చేయాలని తలచి రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి, హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ విజయరాణి, బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు పుట్టి సాంబశివరావు, తోట ఆంజనేయులు, కాపుగంటి వెంకట రత్నం, దనేకుల సాంబశివరావు, దేవరపల్లి మల్లికార్జునరావు, శిరసాల భుజంగరావు, నల్లబోతుల నరసింహారావు, గుంటూరు గాలిబాబు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఫాదర్ రెవ.ఎస్ రాజేష్

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల (ఎస్సీ) వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, ఎం.గణేష్, 88 తాళ్లూరు కాంప్లెక్స్ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ హాజరయ్యారు. హెచ్‌ఎం పి.పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల పూర్వ విద్యార్థి తాళ్ళూరి రాజశేఖర్ తన తండ్రి పేరు మీద ఒక చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి దానిని ఎంఈవోలచే ప్రారంభింపజేశారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, ఇంగ్లీష్ రోల్ ప్లే, హిందిలో దేశభక్తి గేయాలు అలరించాయి. పీసపాడు గ్రామ సర్పంచ్ కోటమ్మ, గ్రామ పెద్దలు కంచేటి నరసింహారావు, పాఠశాల చైర్మన్ మేకల రమేష్ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు జంగం కోటేశ్వరరావు, రాఘవరావు, ఖాజావలి, పూర్వ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు హరిప్రియ, జ్యోత్స్న, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాదలలో అగ్ని ప్రమాదం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. గ్రామానికి చెందిన గున్నం వెంకటేశ్వరరెడ్డికి చెందిన గేదెల పాకలో అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఆరు గదుల గేదెల కొట్టంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, రెండెకరాల వరిగడ్డి పూర్తిగా కాలిపోయినట్లు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదంలో కాలిపోయిన ద్విచక్ర వాహనాలు